
# ఇరుకు



కె.కె.రఘునందన

ఆఫీసులో ఏదో గొడవపడ్డాడు చరణ్. అందువల్ల మహాకోపంతో ఇంట్లోకి అడుగుపెట్టాడు. వచ్చీ రావటంతోనే భార్యను కేకేశాడు.

రొట్టెల పిండి కలుపుతున్న నవ్య ఆదుర్దాగా వెళ్లింది.

ఆమె వెంట వచ్చిన పిల్లలను చూసి, "మేళం దిగిందా!" అన్నాడు అక్కసుగా చరణ్.

"అది కాదండీ ... మా చెల్లెలు కావ్య భర్త మరో నెలరోజుల్లో దాన్ని తీసుకుపోతాట్ట! అందువల్ల అక్కాచెల్లెళ్లం ఒకరి మొహాలొకరం చూసుకునే వీలుండదని తనే వచ్చింది ... పైగా వాళ్ల అత్తా మామలు తీర్థయాత్రలకు వెళ్లారట! ఒక్కతే ఉండలేక వచ్చేసింది!" సంజాయిషీ ఇస్తున్నట్లుగా చెప్పింది.

చరణ్ అప్రసన్నంగా మొహం మార్చాడు.

నవ్య, కావ్య అక్కాచెల్లెళ్లు. కావ్య భర్త దినేష్‌కి నేవీలో నౌకరీ. తనకు తీసుకువెళ్లే వీలు లేదని స్వగ్రామంలోనే విడిచిపెట్టాడు. ఇదివరలో తమవద్ద ఉంచమని ఒత్తిడి చేశాడు దినేష్. కానీ వీలవదని తప్పించుకున్నాడు చరణ్.

అందువల్ల అక్కను చూసేందుకు అప్పుడప్పుడూ వచ్చి రెండు రోజులుండి వెళ్తుంది కావ్య.

అయితే ఈసారి ఆమె పిల్లలతోపాటు దిగటం ఎంతమాత్రం నచ్చలేదు చరణ్‌కు. కారణం ఇప్పుడున్న ఇల్లు మహా ఇరుకు. అతిథులొస్తే సర్దుకోవటం కష్టం ... పైగా ఇంటి యజమాని పెట్టే ఆంక్షలు బోలెడు!

"బావా, బాగున్నావా?" కావ్య పలకరించింది.

"ఊఁ." ముక్తసరిగా జవాబిచ్చాడు చరణ్.

తరువాత చరణ్ స్నానం చేసి వచ్చి పక్కమీద నడుం చేరవేశాడు.

"డాడీ .... డాడీ...!" అని పిల్లలు మహేష్, కవిత వచ్చి బెడ్ ఎక్కారు. అదే సమయానికి కావ్య పిల్లలు సుదీప్తి, నరేంద్ర, మహిత ముగ్గురూ గబగబా వచ్చి బెడ్ ఎక్కేశారు.

తల పట్టుకున్నాడు చరణ్. వాళ్లను గుడ్లురిమి చూశాడు. అయినా కదల్లేదు.

"నవ్యా!" ఒక్క కేక వేశాడు.

నవ్య వచ్చి పరిస్థితి చూసింది.

"మన పిల్లలు ఎక్కితే వాళ్లూరుకుంటారా? పసివాళ్లు వారికేం తెలుస్తుంది?" అని అందరినీ తీసుకెళ్లిపోయింది.

ఆ రాత్రి నవ్య అందరికీ పడకలు ఒకేచోట ఏర్పాటు చేసింది. చరణ్ మొహం మాడిపోయింది. మెల్లగా కనుసైగతో భార్యను పక్కకు పిలిచాడు.

"నీకేం మతిపోయిందా? ఇప్పటికే మన పిల్లలు ఓపట్టాన పడుకోరు. మిగతా రాక్షసులు మరీ తినేస్తారు. మరి ... మనం ...." అని నసిగాడు.

"ఎప్పుడూ మీకా సోదే! ఈ రెణ్నాళ్లూ ఆగితే అదెళ్లిపోతుంది. అంతవరకూ ..." అని వెళ్లిపోయింది.

బాత్రూమ్‌కి వెళ్లటానికి సందు లేకుండా పడుకున్నారంతా.

ఆ రాత్రి శివరాత్రే అయింది. ఉదయం చూసేసరికి నరేంద్ర బెడ్ ఎక్కి పడుకుని ఉన్నాడు. బెడ్ అంతా తడిపేశాడు.

"ఛ ఛ! వెధవలు .... వెధవలని ....! ప్రశాంతంగా కాసేపయినా నిద్రపోనివ్వరు!" అని మండుతున్న కళ్లతోనే లేచి వెళ్లి వరండాలో నేలమీద పడుకున్నాడు చరణ్.

ఇదంతా చూసిన కావ్యకు చివుక్కుమన్నది. బెడ్‌మీదనుంచి నరేంద్రను దించి నాలుగు వాయించింది.

"ఆయన నిద్రలేదన్న చిరాకుతో ఏదో అంటే, పసివాడి నెందుకలా బాదేస్తావు?" అని దెబ్బలాడింది కావ్య.

కావ్య ముగ్గురు పిల్లలనూ ఈడ్చుకెళ్లింది స్నానానికి.

ఆ ఇంట్లో నాలుగు కుటుంబాలకు ఒక్కటే లావెట్రీ. ఉదయం 'క్యూ' కట్టినట్లే ఉంటుందక్కడ. సుదీప్తి కడుపు నొప్పి భరించలేక అక్కడే కంగాళీ చేసేసింది. అది చూసి ఓనరు కూతురు కలియబడింది.

"పిల్లలకి తెలియకపోతే పెద్దదానివి నువ్వు చెప్పాలి! గలీజ్ చెయ్యడానికి మా ఇల్లే దొరికిందా!" అంటూ పెద్ద గొడవ.

అది చరణ్‌కు వినిపించింది.

"చూశావా, నవ్యా! నా పరువు తీశారు. ఇంట్లో దిగినప్పుడే కండిషన్స్ పెట్టారు వాళ్లు. ఈ ఇరుకిల్లు సరిపోదని నీకు తెలుసు. మనమే సర్దుకోలేక సతమతమవుతున్నాం. ఈ సంతతో ఎలా ఉండగలం చెప్పు?" కటువుగానే అన్నాడు చరణ్.

"మా చెల్లెలు రావటం మీ కెప్పుడూ ఇష్టం ఉండదు. దానికి గతి లేకనే కదా వస్తోంది ... అదీ ఎప్పుడో...!" అని బాధగా అన్నది నవ్య.

"నువ్వేలాగనుకున్నా నాకు ఫరవాలేదు. ఆ జట్టీలు కూడా నువ్వే విడిపించుకో!" అనేశాడు.

ఆ రాత్రి కూడా నిన్నటి పరిస్థితే ఎదురైంది చరణ్‌కు.

000

"ఇదిగో చరణ్‌గారూ! ఇలా రండి ...!" సాయంత్రం ఆఫీసు నుండి గడపలోకి కాలు పెడుతుంటే ఇంటి ఓనర్ జగన్నాథం పిలిచాడు.

"చూడండి ... మీ కిది ధర్మంగా ఉందా? వీధిలో అందంగా కనిపిస్తాయని పూలమొక్కలు వేసుకుంటే ఎలా పీకి పోగులుపెట్టారో చూడండి! మా అమ్మాయింకా చూడలేదు, చూస్తే పెద్ద గొడవ పెడుతుంది. మీకు అద్దెకిచ్చింది చక్కగా చూసుకుంటారని ... అంతేగానీ నాశనం చేయటానికి కాదు!"

చరణ్ రక్తం జర్రున పాకిందొక్కసారి. సుడిగాలిలా లోపలకు దూసుకెళ్లాడు. "నవ్యా!" అని కేక పెట్టాడు. ఆమె పక్కనే కావ్యకూడా ఉన్నది.

ఇద్దరినీ ఉద్దేశించినట్లుగా విషయం కటువుగానే చెప్పాడు. అంతే! కావ్య పరుగున వెళ్లి మేడమీద ఉన్న పిల్లందరినీ కిందకు ఈడ్చుకొచ్చింది.


"నరేంద్రగాడే మొక్కలు పీకాడు!" అందరూ కూడబలుక్కుని చెప్పారు.

కావ్య మరి సహించలేకపోయింది. మూలనున్న కర్ర తీసి అపరకాళీలాగా విజృంభించేసింది.

"కావ్యా! నీకేమైనా మతిపోయిందా? పిల్లల కసలేం తెలుస్తుంది?" అని కర్ర లాక్కుంది నవ్య.

000

చరణ్‌కి ఆవేశం పట్టపగ్గాల్లేకుండా ఉంది. కోరిక



## సూపర్‌స్టార్ కుమార్తె రంగప్రవేశం!

మన సూపర్‌స్టార్ కాదండీ, తమిళసూపర్‌స్టార్ రజనీకాంత్ కుమార్తె. ఈమె పేరు ఐశ్వర్య. భరతనాట్యం అభ్యసించి ఈ మధ్యే ప్రముఖుల సమక్షాన అరంగేట్రం చేసి, అందరినీ ఆశ్చర్యానందాల్లో ముంచెత్తింది ఐశ్వర్య. దీనికి తోడుగా సంగీతం కూడా నేర్చింది. కళాపిపాసకూ ఏం తక్కువలేదు. అయినా అసలు సస్పెన్సు ఇప్పుడు విందాం. ఇంతకూ ఐశ్వర్య రంగప్రవేశం చేసింది సినీనటిగా కాదుట, గాయనిగా! ఇటీవలే వాయిస్‌టెస్ట్ చేయించుకుందట. మరైతే మరో గాయని రాబోతూందన్న మాటేగా! తమిళంలో పాడినవాళ్లంతా తెలుగులోకీ రావడం సహజమే. మనలో మాట- ఈ ఐశ్వర్య నటిగా వచ్చేస్తే ఇప్పుడున్న ఐశ్వర్య రారెత్తిపోతుందేమో?

ఎస్.

చిచ్చుపెడుతూనే ఉంది.

కొంతసేపటికి పిల్లలు నిద్రలోకి జారారు. అప్పటికే నవ్య పీక్కుపోయి ఉన్నది. నిరాసక్తంగానే భర్తచెంత చేరింది. భార్య పెద్దగా స్పందించకపోయినా సరే, తన ఆవేశం చల్లార్చుకున్నాడు చరణ్.

అర్ధరాత్రి అయింది. చరణ్‌లో కోరిక పునరుద్భవించింది. భార్యను కదిపాడు. తెలివి లేకుండా నిద్రలో ఉంది. చరణ్‌కి బుర్ర పిచ్చెక్కిపోయింది.

కొద్దిసేపటికి బాత్రూమ్‌కని లేచాడు.

వరండాలో కావ్య, పిల్లలతో పడుకునుంది. బాత్రూమ్ నుండి తిరిగి వచ్చేటప్పుడు చరణ్ కళ్లు తళుక్కుమన్నాయి. అంతే, ఆగిపోయాడు.

ఫాన్ గాలికి కావ్య పైట స్థానభ్రంశం చెందింది. కింద హుక్స్ తెగటం వల్ల స్తనాలు బయటకు వచ్చి, బింకంగా కనిపిస్తున్నాయి. అది చూసిన చరణ్‌లో పురుషత్వం ఒక్కసారి మేల్కొంది. ఇంతకాలం తన దృష్టిలో కావ్య మామూలు స్త్రీ. కానీ ఇంత అందం పొంగిపొర్లుతూందని తను అనుకోలేదు. పైగా ఆమెను పట్టించుకోలేదు కూడా.

కావ్యకు కొద్ది దూరంగా పిల్లలు పడుకున్నారు. వెల్లకిలా పడుకుని, గాఢంగా నిద్రిస్తోంది కావ్య.

తన భార్య చూస్తుందేమో నని ఒకసారి బెడ్రూమ్‌లో పరిస్థితి గమనించాడు. నవ్య ఇంకా నిద్రలోనే ఉంది.

చరణ్‌కు మనసు నిలవలేదు. కాళ్లు లబలబలాడసాగాయి. చిన్నగా కంపించసాగింది శరీరం. మెల్లగా కిందకూర్చుని కావ్య పక్కగా చేరి ఆమె వక్షసంపదను సుతారంగా స్పృశించాడు. మరి కాస్త అదిమాడు. అయినా చలనం లేదు. పచ్చగా మెరుస్తున్న పల్చటి పొట్ట మధ్యలో సుళ్లు తిరిగిన సుడిగుండంలాండి బొడ్డును ముద్దాడాడు. తరువాత అధరాల మీద చుంబించాడు.

తనక్కావలసిన అన్ని అందాలనూ ఆమెలో చూశాడు.

అయితే కోరిక తీర్చుకోవటానికి మాత్రం జంకాడు. మెల్లగా వెళ్లి తన బెడ్ చేరి ఆలోచనలో పడ్డాడు.

ఛీ! తనేనా ఈ అద్భుత సౌందర్యాన్ని దూరం చేసుకోబోయింది? ఇంతకాలం తనా ఈ అందాల బొమ్మను విసుక్కున్నది??

నిజానికి తను కలుపుగోలుగా ఉంటూ ఆమెనుండి ఎన్నో అందమైన అనుభవాలను ఆస్వాదించటానికి బదులుగా దూరదూరంగా, అంటరానిదానిలా చూస్తూండిపోయాడు. కారణం తనకే తెలియదు!

లేదు ... తను ఇకనుంచైనా కావ్యకు దగ్గరవ్వాలి. అభిమానించాలి ... ఆమె గుండెల్లో అయినవాడిగా ముద్రపడాలి. అప్పుడే తనను అభిమానిస్తుంది. అప్పుడు తను అనుకున్నది సాధించగలడు.

ఆ రాత్రంతా తీపి కలలతోనే గడిపాడు చరణ్.

000

"ఏమండీ! నేను విజయనగరం వెళ్లివస్తాను, మీరాఫీసుకు వెళ్లే టైమ్‌కి కావ్య వడ్డిస్తుందిలెండి! వీలైనంత త్వరగా వచ్చేస్తాను!" అని బయులుదేరింది నవ్య.

ఉదయం పది గంటలైంది.

"బావా, భోజనం చేస్తావా?" అని పిలిచింది కావ్య.

భోజనం చేస్తున్నంతసేపూ ఆమె అందాలను కళ్లతో జుర్రుకుంటూనే ఉన్నాడు చరణ్.

భోజనం చేశాక ఆఫీసుకు వెళ్లిన చరణ్‌కి మనస్సు నిలవలేదు. డ్యూటీమీద దృష్టి లేదు. అందుకని లీవులెటర్ ఇచ్చేసి వెనక్కి వెళ్లిపోయాడు.

అతను వెళ్లేసరికి కావ్య ఒక్కతే బోర్లా పడుకుని చదువుకుంటోంది. ఆ భంగిమలో కావ్య పైట చెదిరి వక్షస్థలం కనువిందు చేసింది.

"అరె ... ఏమిటలా ఉన్నావు, బావా? ఏం ... తిరిగొచ్చావు?" అడిగింది ఆత్రుతగా కావ్య.

"తల నొప్పిగా ఉందని సెలవు పెట్టాను!" ముక్తసరిగా చెప్పాడు చరణ్.

"అరె ... అలాగా ... ఉండు, టీ కాచి ఇస్తాను!" అని లోపలికి వెళ్లి రెండు నిముషాల్లో కప్పుతో తిరిగి వచ్చింది కావ్య.

టీ తాగాక కప్పు లోపలపెట్టి ఝుండూబామ్ సీసా తెచ్చింది.

"అలా రిలాక్స్‌డ్‌గా పడుకోండి, నేను రాస్తాను!" అని చరణ్ ఛాతీకి, నుదురుకు ... ముక్కుకు ఝుండూబామ్ పట్టించింది.

కావ్య తన సున్నితమైన చేతులతో రాస్తున్నంతసేపూ చరణ్‌కు పిచ్చెక్కిపోయింది.

చేపల్లాంటి నేత్రాలతో ... ఎర్రటి అధరాలతో .... ఉన్నతమైన ఎదసంపదతో కావ్యనాయికలా అలరారే కావ్యను కోరి ఇంతకాలం దూరం చేసుకున్నాడు. ఆ బాధే సన్నగా ఎదలో మెలితిరిగింది. ఆమె నెలాగైనా పొందాలన్న తాపత్రయం పెరిగింది.

కానీ ఈలోగా తొందరపడి ఏం చేసినా బెడిసికొట్టే ప్రమాదం ఉందని గ్రహించి ఊరుకున్నాడు చరణ్.

సాయంత్రానికి నవ్య వచ్చేసింది. ఆ సమయంలోనే ఎవరో పిలిస్తే బయటకు వెళ్లాడు చరణ్. నవ్య, కావ్య కాఫీలు తాగుతూ కబుర్లలో పడ్డారు. అప్పుడే లోపలనుంచి భళ్లున శబ్దం అయింది ...


"అమ్మా!.... అమ్మా! నాన్నగారి గదిలో తాజ్‌మహల్ బొమ్మను నరేంద్రగాడు బద్దలు కొట్టాడు!" పరుగున వచ్చి ఫిర్యాదు చేశాడు మహేష్.

నవ్య, కావ్యల ప్రాణాలు పైనే పోయాయి. డ్రెస్సింగ్ టేబుల్‌మీద అద్దాల తాజ్‌మహల్ ఘోరంగా బద్దలయింది.

"ఇది బావకు ఎవరో ఆప్తమిత్రుడు ఇచ్చిన బహుమతి. నిష్కారణంగా ముక్కలైపోయింది. ఆయనొస్తే ఒంటికాలి మీద లేస్తారు!" అని బాధగా, నిష్ఠూరంగా అన్నది నవ్య.

కావ్య కోపానికి అంతులేకుండా పోయింది. నరేంద్రను చితకబాదింది.

"నేనింకొక్క క్షణం ఉండలేను, నవ్యా! బావ వస్తే వీరావేశం ఎత్తిపోతారు. అయినా నాదే తెలివితక్కువతనం ... నీ మీద మమకారం కొద్దీ ఈ రాలుగాయిలతో ... చాలదంటున్నా ఈ ఇరుకింటిలో తిష్ఠ వేసాను. ఎంత సిగ్గుగా ఉందో చెప్పలెను!" అని గబగబా బట్టలు సర్దుకోసాగింది



కావ్య.

సరిగ్గా అప్పుడే చరణ్ ఇంట్లో అడుగుపెట్టాడు. నవ్య అంతా చెప్పింది. విని, ఎక్కడ విరుచుకుపడతాడో అని భయపడింది. కానీ అందుకు భిన్నంగా ఏమాత్రం కోపం ప్రదర్శించకపోవటం విడ్డూరంగా అనిపించింది నవ్యకు.

కావ్య మరీ ఆశ్చర్యపోయింది.

"కావ్య బట్టలు సర్దుకుంటోందేమిటి? మరో నాలుగురోజులుండి వెళ్లమను ...!" భర్త ఆ మాటనడంతో మరీ నిశ్చేష్టురాలైపోయింది నవ్య.

"ఈ ఇల్లు ఇరుగ్గా ఉందని ... ఈ అల్లరి పిల్లలతో వేగలేక వెళ్లిపోతానంటోంది!" అంది కావ్య.

"మన అద్దె ఇళ్లల్లో ఇటువంటివి మామూలే! ఉండమను!" అని చెప్పాడు చరణ్.

బిత్తరపోయింది నవ్య. తన భర్తేనా ఇలా అంటున్నదీ....! అని వింతగా చూసింది.

అయితే అక్క చెప్పినప్పటికీ కావ్యకు ఒక్క క్షణం ఉండబుద్ధి కాలేదు. కానీ చరణ్ స్వయంగా ఉండమని చెప్పాక అభిప్రాయం మార్చుకుంది.

000 000 000

రాత్రి పన్నెండు గంటలయింది.


చరణ్ నిద్ర నటించి ముందే ముసుగుపెట్టాడు. గాఢనిద్రలోకి జారింది నవ్య. అది కనిపెట్టి పిల్లిలా అడుగులు వేస్తూ వరండాలోకి నడిచాడు చరణ్.

కావ్య కూడా మంచి నిద్రలో ఉంది. పిల్లలు ఆమె మీద ఎక్కి పడుకున్నారు. చరణ్‌లో ఆవేశం కట్టలు తెంచుకోసాగింది. పిల్లలను ఆమెనుండి వేరుచేసి వేరేగా పడుకోబెట్టాడు. ఆమె కొద్దిగా కదలగానే క్రీనీడలోకి తప్పుకున్నాడు. తర్వాత ఆమె నిద్రలోకి జారగానే మెల్లగా చేరి ఆమె జాకెట్ హుక్స్ ఒకటొక్కటే తప్పించి ఎద సంపదమీద దాడి ప్రారంభించాడు. అందిన చోటల్లా ముద్దులు పెట్టుకున్నాడు. ఆమె ఏమాత్రం కదిలినా లేచి తప్పుకుంటున్నాడు.... చివరికి తట్టుకోలేని కోరికతో పూర్తిగా ఆక్రమించుకోవడానికి సిద్ధపడ్డాడు.

కానీ కవిత ఏడుపు వినిపించింది. ఇంక నవ్య లేవటం ఖాయమని తెలుసుకుని, గబగబా వెళ్లి పడక చేరాడు చరణ్. ఆ రాత్రి మరింకేమీ చేయ సాహసించలేదు. ప్రయత్నిస్తే తనకు ఫలితం దక్కుతుందనే ఆశావాదం అతనిలో పూర్తిగా నిండింది.

000

"ఈ రాలుగాయి లొక్కలా ఉండరక్కా! మీరీ ఇరుకింట్లోంచి మరో పెద్దింటికి మారాక వస్తాములే!" అంటున్నది కావ్య.




"బావకు నీ మీదకోపం కూడా లేదు. నువ్విప్పుడు ఫ్రీగా ఉండొచ్చు!" బతిమాలుతోంది నవ్య.

ఈ సంభాషణ లీలగా వినిపించి గభాలున లేచిపోయాడు చరణ్.

"ఏమండీ! మా చెల్లెలు వెళ్లిపోతుందట ... త్వరగా లేవండి!" కేక వేసింది నవ్య.

"పాపం, సెలవే కదా! కాసేపు పడుకోనీ అక్కా!" అని జాలిగా అంది కావ్య.

ఈ మాటకు గబగబా వచ్చి, కావ్యను మరోవారంపాటు ఉండమని కోరాడు చరణ్.

అయినా కావ్య తన ప్రయాణం ఆపుకోలేదు. కావ్య వెళ్లిపోయినా ఆమె రూపం, యౌవన సంపద చరణ్ మనసులో ముద్రించుకుపోయాయి. కనులు మూసినా, తెరచినా ఆమే కనిపించి ఊరిస్తున్నది.

ఆఫీసులో సైతం మనసు లగ్నం చేయలేకపోయాడు చరణ్. పది రోజులు గడిచాయి. ఒకరోజు చరణ్‌కు ఓ ఉత్తరం వచ్చింది. విప్పి చదివాడు.

"బావకు ...

"మీ మరదలు కావ్య వ్రాయునది.

"ముందుగా నన్ను మీరు క్షమించాలి. ఎందుకంటే ఇంటి ఇరుకు విషయం తెలుసుకోకుండా మీ ఇంటికి వచ్చి తిష్టవేయడం నా తప్పు. నా భర్త దూరంగా ఉండటం వల్ల, దగ్గరగా ఉన్న అక్కమీద మమకారంతో ఇల్లు ఇరుకైనా సరే పట్టించుకోకుండా గడిపాను.

అయితే ఇక్కడో విషయం ... ఏది ఇరుకైనా భరించే మనిషి, మనస్సులో ఇరుకుతనాన్ని మాత్రం భరించలేడన్నది వాస్తవం! మొదట మీరు మా పిల్లలపైనా, నా పైనా ఎంతవరకూ చికాకును, అసహనాన్ని ప్రదర్శించారో మీకు తెలుసు. అయితే ఎప్పుడూ ధుమధుమలాడుతూ, కోపంతో మీరు మీ వైఖరి మార్చుకుని, అకస్మాత్తుగా మనసు విశాలం చేసుకున్నా, నాకెందుకో కృత్రిమంగానే అనిపించింది.

మీ ఆప్తమిత్రుడు మీ కోసం బహుమతిగా ఇచ్చిన అద్దాల తాజమహల్‌ను బాబు తునాతునకలు చేసినా సరే రవ్వంతైనా ఆగ్రహం, ఆవేశం ప్రదర్శించకపోవటంతో నాకెందుకో అనుమానం వచ్చింది. అంతేకాక ఎప్పుడు వెళ్లిపోతామా అని ఎదురు చూసే మీరు మరో నాలుగు రోజులు ఉండమనటం మరీ వింతగా తోచింది.

"వీటన్నింటికీ కారణం మీరు నా మీద కన్ను వేశారని గ్రహించాను. అందుకే ఆ రోజు మీరు నా మీదకోరికతో మీదపడ్డా నేను మిమ్మల్ని పురుగులా భావించి భరించానే తప్ప ఇష్టపడి కాదు! కారణం మా అక్క కాపురంలో నిప్పులు పోయటం ఇష్టం లేక ... మా అక్కముందు మీ పరువు తీస్తే ... జరిగేది నష్టమే తప్ప మరేమీ కాదు. పరవాంఛ ఘోర తప్పిదాలకు దారి తీస్తుంది. ఒకప్పుడు కోపిష్టి అయినా సరే మీ సహజ ధోరణి నన్ను బాధించలేదు. కానీ ఎప్పుడైతే మీలో అసహజ భావన బయలుదేరిందో ఆ క్షణం మొదలు నాలో మీపై ఏహ్యత ఏర్పడింది. కానీ నా భావాలు బయటపడకుండానే నేను బయటపడ్డాను.

"ఇంటి ఇరుకు భరించవచ్చు కానీ, సంకుచిత మనస్సును ఓ క్షణం కూడా సహించలేము. ఈ విషయం మీరు గుర్తించి ఇకముందు మీ దాంపత్యంలో అపస్వరాలు రాకుండా ప్రవర్తించండి! అదే మీకు శ్రీరామరక్ష!

"మిమ్మల్ని బాధిస్తే క్షమించగలరు.

"ఇట్లు,

"కావ్య."

ఉత్తరం చదివిన చరణ్ బొమ్మలా ఉండిపోయాడు.